క్లుప్తంగా

చిరుద్యోగులపై కక్ష సాధింపు



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

చింతలపూడి: స్కీం వర్కర్లపై అధికార పార్టీ నాయకులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్వీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నత్తా వెంకటేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం మండల సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్వీ సత్యనారాయణ మాట్లాడుతూ స్కీం వర్కర్ల కుటుంబాల్లో ఎవరైనా ఇతర పార్టీల పట్ల అభిమానం కలిగి ఉంటే దానిని ఆసరాగా చేసుకొని చిరుద్యోగులైన స్కీం వర్కర్లపై వేధింపులకు పాల్పడుతున్నారని, వారిని ఉద్యోగాల నుంచి తప్పించి తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి పరిణామాలు అధికార పార్టీకి తగదన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



పట్టుబడిన నిందితుడితో అధికారులు

చింతలపూడి: మండలంలోని నామవరంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శుక్రవారం తెల్లవారు జామున నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. దాడుల్లో బోడా రామారావు తన ఇంటి సమీపంలో నాటు సారా తయారు చేస్తుండగా అధికారులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 90 లీటర్ల నాటు సారా, 119 కేజీల తెల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. సంఘటనా స్థలంలో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. రామారావు, బెల్లం సరఫరా చేసిన బాణావతు మారేశ్వరరావులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, ఆర్వీఎల్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ బహూకరణ



వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు మోండలీజ్ (కోకాకోలా) సంస్థ వారు 250 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సురేష్‌కు ఈ యంత్రాన్ని అందించి, విద్యార్థుల సౌకర్యార్థం దీన్ని వినియోగించాలని కోరారు. ఈ సందర్భంగా హెచ్ఎం సురేష్ మోండలీజ్ వారి దాతృత్వాన్ని కొనియాడారు. కార్యక్రమంలో మోండలీజ్ సంస్థ మేనేజర్ రాజేష్, అసిస్టెంట్ మేనేజర్ రవీంద్ర, బాబు, మనోజ్, ఆఫ్రో సంస్థ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ నాగరాజు, ఏరియా ఫీల్డ్ సిబ్బంది శివ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

పశు గణన పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: పశువుల సమగ్ర సమాచారాన్ని అధికారులకు అందించి పశుగణానికి సంబంధించిన వివిధ పథకాల అభివృద్ధికి ప్రజలు దోహదపడాలని ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పరింపూడి పశు వైద్యశాలలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పశు వైద్యాధికారి బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరిగణకర్తలకు శిక్షణ, సూచనలు, సంఖ్యా గణన కిట్లు అందించారు. సచివాలయాలకు సమాచారం అందించాలని సర్వే నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. ఈవో కె.సురేష్, వీడీలు, గోపాలమిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు ప్రారంభం



వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: లివింగ్ శాక్రిఫైస్ (ఎల్ఎస్ఎం) సంస్థ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో వెనుకబడిన ప్రాంతంలో నిర్వహించే సేవా కార్యక్రమాల వలన ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరిందని పరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం బ్రహ్మల కాలనీలో సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన తాగునీటి వాటర్ ట్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. రాచూరి మదన్, వూసల రాజేష్, ముప్పిడి చినబాబు, సంస్థ ఆర్గనైజర్ కనకరాజు పాల్గొన్నారు.

వరిలో సంప్రదాయ పద్ధతులు పాటించాలి

- రసాయన ఎరువులతో పొంచి ఉన్న ముప్పు
- రైతులకు వ్యవసాయాధికారుల సూచన



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

చింతలపూడి: ప్రజల ఆహార అవసరాలు తీర్చడంలో ప్రథమ స్థానంలో ఉన్న వరి పంటను పండించడంలో రైతులు సంప్రదాయ పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంది. రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వలన సమతుల్యత లోపిస్తుంది. అంతేకాక చీడపీడల్లో రసాయనాలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుంది. అందుకే వరి పంటలో యాజమాన్య పద్ధతులను పాటించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ప్రస్తుతం వరి ఈనిక దశ నుంచి గింజ గట్టిపడే దశలో ఉంది. ఈ దశలో సాధారణంగా వచ్చే చీడపీడలకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా నివారించుకొని, రైతులు అధిక దిగుబడులు సాధించొచ్చని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జిల్లాలోని మెట్ట ప్రాంతం చింతలపూడి సబ్ డివిజన్ పరిధిలోని చింతలపూడి మండలంలో 13,175 ఎకరాలు, లింగపాలెం మండలంలో 6,449 ఎకరాలు, టి.నరసాపురం మండలంలో 2,400 ఎకరాలు, కామవరపుకోట మండలంలో 3,400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేపట్టారు. ముందుగా రైతులు వరిలో సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి. చిరు పొట్ట దశ నుంచి గింజ గట్టి పడే దశ వరకు 5 సెంటీ మీటర్ల లోతు వరకు నీరు ఉండేలా చూసుకోవాలి. కోతకు 10 రోజుల ముందుగా పొలంలో నీటిని తగ్గించి ఆరబెట్టాలి. లింగాకర్షక బుట్టలతో మోగి పురుగు ఉద్ధృతిని గమనించాలి. హాని చేయు పురుగులు, మిత్ర పురుగుల నిష్పత్తి 2/1 నిష్పత్తిలో ఉన్నప్పుడు సస్యరక్షణ చర్యలను వాయిదా వేసుకోవాలి. పొలం గట్లపై ఉండే గడ్డి, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేసుకోవాలి. మురుగు నీటిని బయటకు తీయడం ద్వారా తెగుళ్లు, పురుగుల అభివృద్ధిని అదుపులో ఉంచొచ్చన్నారు. రైతులు నత్రజని ఎరువులను వ్యవసాయాధికారుల సిఫార్సులకు మించి వేయకూడదు.

సుడిదోమ నివారణ ఇలా

వరిలో సుడిదోమ ఆశించినట్లయితే పొలాన్ని అడపాదడపా ఆరబెట్టుకోవాలి. ప్రతీ రెండు మీటర్ల నాట్లకు 20 సెంటీ మీటర్ల కాలిబాటలు వదులుకోవాలి. వేప నూనె (1500 పీపీఎం) 3 మిల్లీ లీటర్లు, ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా డైనో ట్రిప్యూరాన్ 0.4 గ్రాములు, లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. దోమ ఎక్కువగా ఆశించినప్పుడు ప్రొఫెనోపాస్, ట్రైజోపాస్, క్లోరి పైరిపాస్, మోనో క్రోటోపాస్, సింథటిక్ పైరి త్రాయిడ్ మందులను పిచికారీ చేయకూడదని హెచ్చరించారు. వరిలో తెల్ల కంకులు (కాండం తొలుచు పురుగు) నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్, 2 గ్రాములు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. వరిలో దోమపోటు నివారణకు రసాయన ముందులే కాకుండా ప్రకృతి వ్యవసా య పద్ధతులను అవలంభించి నివారించొచ్చన్నారు. తూటికాడ ఆకులు 10 కేజీలు, ఆవు మూత్రం 15 లీటర్లు కలిపి కషాయం తయారు చేసుకొని పిచికారీ చేసుకోవాలని సూచించారు.

> **తప్పనిసరి పరిస్థితుల్లోనే వాడాలి**
>
> 
>
> తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే క్రిమి సంహారిక శిలీంద్రాలను పిచికారీ చేయాలి. పిచికారీకి ముందే నీటి మట్టాన్ని బాగా తగ్గించాలి. పైరు బాగా తడిచేలా మందు ద్రావణాన్ని ఉపయోగించాలి. విచక్షణ రహితంగా పలురకాల శిలీంద్ర నాశక, క్రిమి సంహారక మందులను రెండింటినీ కలిపి పిచికారీ చేయకూడదు.
>
> –బి.నాగకుమార్, సహాయ సంచాలకులు

ఎంఈవో సమీక్ష సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని అన్ని యాజమాన్యాల్లో గల పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు పెంచడం ఏపీఏఏఆర్ ఐడీఎస్ రిజిస్ట్రేషన్లు చేయడం, ఎండీఎం మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని ఎంఈవో తెల్లం బాబూరాజు అన్నారు. బుట్టాయగూడెంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏలూరు అధికారుల బృందం ఎండీ షరీఫ్, రాధాకృష్ణ, గౌస్‌కుమార్, ఎంఈవో–2 నరేంద్రరాయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను గౌరవించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ద్వారకాతిరుమల: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 11న మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించి, గౌరవించాలని ఏపీటీఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, నీలి శ్రీనివాస్ కోరారు. ఈ సందర్భంగా వారు ఎంఈఓ–1 డి.సుబ్బారావును శుక్రవారం కలిసి, వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి అబ్బుదాసరి శ్రీనివాస్, కామవరపుకోట మండల ప్రధాన కార్యదర్శి మల్ల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా



ఎంపీడీవో కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్ల 3 నెలల బకాయి వేతనాలను చెల్లించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ సెప్టెంబర్ 2వ తేదీన ప్రభుత్వం జీవో నెంబర్ 413 విడుదల చేసిందన్నారు. జీవో ప్రకారం చెల్లించవలసిన వేతనాలు ఇప్పటివరకూ చెల్లించలేదని అన్నారు. అనంతరం జిల్లా ఏడీ షరీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, నాగరత్నం, నాగమణి, మంగ, సంధ్య, సోమాలమ్మ, రామలక్ష్మి, గంగాదేవి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ సేవల మెరుగుకు కృషి



ముక్కమ్మ గుడి ఐరన్ గేట్లను ప్రారంభిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: గిరిజన ప్రాంతంలో వాసవీక్లబ్ సేవలను మరింత మెరుగు పరిచే విధంగా కృషి చేస్తున్నామని వాసవీక్లబ్ జిల్లా గవర్నర్ కంచర్ల రామ్మోహన్‌రావు అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన చింతలగూడెం పోగొండ రిజర్వాయర్ సమీపంలో కొలువైన ముక్కమ్మ గుడికి నిమ్మలగూడెం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సుమారు రూ.42000 వ్యయంతో ఐరన్ గేట్లను ఏర్పాటు చేశారు. వీటిని శుక్రవారం రామ్మోహన్‌రావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో, పలు ప్రదేశాల్లో ప్రజల సౌకర్యార్థం బెంచీల ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలు చేశామన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ జిల్లా సెక్రటరీ కొనికళ్ల జగదీష్, ట్రెజరర్ ఉడతా లక్ష్మణరావు, రీజన్ ఛైర్మన్ ఉప్పళ్ల మణికంఠ సతీష్, వెత్స సత్యనారాయణ, తుమ్మలపెంట జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేస్తా

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

సాక్షి స్పందన

వేలేరుపాడు: పోలవరం ముంపు నిర్వాసితులకు కూటమి ప్రభుత్వంలో పూర్తి న్యాయం జరుగుతుందని, పోలవరం ఎమ్మెల్యే చిర్రిబాలరాజు పేర్కొన్నారు. ఎవరూ ఎలాంటి అపోహలు చెందొద్దన్నారు. వేలేరుపాడు మండలంలోని జగన్నాథపురంలో 140 మంది నిర్వాసితుల స్ట్రక్చర్ వ్యాల్యూస్ అవార్డులో తొలగించిన విషయం ‘సాక్షి’ దిన పత్రికలో శక్రవారం ప్రచురితమైన విషయం విదితమే. ఇదే విషయాన్ని శుక్రవారం మండల జనసేన అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, ఎం.సంజయ్, క్రాంతిమోహన్, తదితరులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో దీనిపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్నాథపురంలో 140 మందిని తిరిగి అవార్డులో చేర్చి పూర్తి న్యాయం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ విషయమై ఆర్అండ్ఆర్ కమిషనర్‌ను కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

వర్జీనియా రైతులకు ట్రేల పంపిణీ



రైతులకు ట్రేలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వర్జీనియా పొగాకు రైతులకు శుక్రవారం కన్నాపురంలో అవగాహన సమావేశం నిర్వహించారు. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారిణి గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజనల్ మేనేజర్ జీఎస్ఎల్కే ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన రైతులకు పాలీ ట్రేలను, పొగాకు నారు పెంచడానికి సామగ్రిని ఉచితంగా అందజేశారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు డాక్టర్ సుమన్ కళ్యాణి డాక్టర్ హేమ తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెంలో ఎంపీ పర్యటన

లింగపాలెం: మండలంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుక్రవారం పర్యటించారు. కొత్తపల్లి కనకదుర్గమ్మ ఆలయంలోని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు, అధికారులు, కూటమి నాయకులు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని అచ్చియ్యపాలెంలో ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంత నియామక చట్టం వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ నెల 30న కేఆర్ పురం ఐటీడీఏ వద్ద జరిగే ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజనులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం లక్ష్మణరావు, రవ్వా బసవరాజు, పొడియం కొవ్వాడయ్య, ఏటీఏ గౌరవ జిల్లా అధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



నూకాలమ్మకు విశేష పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మకు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కల్యాణ కళావేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీ జలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి , నీరాజన మహామంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు అర్చక స్వాములు నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, మహిళలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో

స్థానిక శ్రీచక్ర సహిత ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పర్వదినం సందర్భంగా ఆలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో గల అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, అనంతేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ నిర్మాణ కర్తలు బవిరిశెట్టి మురళీ కృష్ణ, పద్మ కుమారి దంపతులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ముగ్గురికి గాయాలు

వేలేరుపాడు: మండలంలోని రుద్రమకోట గోదావరి రేవు వద్ద శుక్రవారం ముగ్గురిపై తేనెటీగలు దాడి చేశాయి. పడవ దిగి రేవులో ఒడ్డుకు వెళుతున్న సమయంలో ఒక్క సారిగా వీఆర్‌పురం మండలానికి చెందిన కె.శ్రీనివాస్, సాయి, బాలుడు లక్ష్మీవినయ్‌పై తేనెటీగలు దాడి చేయడంతో వీరు ముగ్గురు గాయాలపాలయ్యారు. శరీరమంతా తేనే టీగలు కుట్టడంతో ముగ్గురిని వేలేరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇక్కడ వైద్య సేవలందించిన వేలేరుపాడు వైద్యాధికారి అగత, వీరిలో కె.శ్రీనివాస్కు ఒంటి నిండా గాయాలు కావడంతో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేశారు.

జాబ్ మేళాలో 107 మంది ఎంపిక

జంగారెడ్డిగూడెం: స్థానిక శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 107 మంది వివిధ కంపెనీలకు ఎంపికై నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్‌చార్జి వాడపల్లి కిషోర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు సుమారు 475 మంది ఉద్యోగార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. వారి అర్హతలు, నైపుణ్యాలను పరిశీలించి 107 మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్మెంట్ అధికారి కె.ప్రవీణ్, కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ కె.రమేష్, కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీధర్, కో–ఆర్డినేటర్లు రామకృష్ణ, నాగరాజు, సత్యనారాయణ, కార్తీక్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు గొయ్యి

కొయ్యలగూడెం: బయ్యనగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న గొయ్యి ప్రమాదాలకు నిలయంగా మారింది. బయన్నగూడెం శివారులో వెలగలదిబ్బ ప్రాంతంలో ఉన్న కల్వర్టు వద్ద కంటికి కనిపించని విధంగా గొయ్యి ఏర్పడింది. బయ్యనగూడెం మొదలుకొని జంగారెడ్డిగూడెం వరకు సాఫీగా ఉన్న రోడ్డుకు కల్వర్టు వద్ద మాత్రం గొయ్యి పడింది. అంతా సాఫీగా ఉంటుందని వస్తున్న వాహనదారులు కల్వర్టు వద్దకు వచ్చేసరికి ప్రమాదాలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఆ గుంత కుదుపుకు ట్రాక్టర్‌పై నుంచి యువకుడు కింద పడి మృతి చెందాడు. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురి కావడంతో పాటు స్టీరింగ్ వాహనాలు కంట్రోల్ తప్పుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. గత రెండు సంవత్సరాలుగా ఉన్న గోతిలో పడి ప్రమాదాలు ఎదుర్కొంటున్నామని నేషనల్ హైవే అధికారులు స్పందించి సమస్యను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి లక్ష్మీపురం వరకు కొత్త 11 కేవీ ఫీడర్ వేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త లైన్ వేస్తున్న దృష్ట్యా శనివారం ద్వారకాతిరుమల, కొమ్ముగూడెం లక్ష్మీపురం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

సరస్వతీ విగ్రహం ఏర్పాటు



సరస్వతీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దృశ్యం

టి.నరసాపురం: బండివారిగూడెం ఎంపీయూపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహాన్ని చింతలపూడి ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు, హెచ్ఎం డి.బాజా మాట్లాడుతూ విద్యార్థులు సరస్వతిదేవి ఆశీస్సులతో బాగా చదివి జీవితంలో గొప్పగ స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మెన్ ఎ.మనీషా, నాళం కాశీ, సునీల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు పోలవరంలోని సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల ఏలూరులో నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో ఈ పాఠశాల నుంచి అండర్–17 కేటగిరీలో కె.సత్యచరణ్, అండర్–14 కేటగిరిలో ఎం.అఖిలేష్ ఎంపికై నట్లు పీఈటీ నాగేశ్వరరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ టీనా కొరియా మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు.

పట్టిసీమ గట్టుకు రక్షణేదీ ?

- ఏటా పెరుగుతున్న గట్టుకోత
- ప్రభుత్వ కార్యాలయాలకు పొంచి ఉన్న ముప్పు
- ఆందోళనలో స్థానికులు



అండలుగా జారిపోతున్న పట్టిసీమ గోదావరి గట్టు



పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద కోతకు గురైన లంక గట్టు

పోలవరం రూరల్: మండలంలో పట్టిసీమ రేవులోని గట్టు భారీగా కోతకు గురవుతుంది. దీంతో గోదావరి గట్టుకు రక్షణ లేకుండా పోయింది. ఏటా గోదావరికి వచ్చే వరదలు, మరో వైపు కొండవాగుల ఉద్ధృతికి గట్టు అండలు అండలుగా జారిపోయి, ప్రతీ సంవత్సరం కోత పెరుగుతూనే ఉంది. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోకి చేరుకుంటుంది. గతంలో గోదావరి ఒడ్డున పంచాయతీ, వీఆర్వో, పోలీసు కార్యాలయాల భవనాలు నిర్మించారు. వరదలు, కొండవాగుల ఉద్ధృతికి గట్టు కోత పెరుగుతుండటంతో ప్రభుత్వ భవనాలు నేలకొరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఔట్‌ఫాల్ స్లూయిజ్‌కు నది వైపు కొంతమేర రక్షణ గోడ నిర్మించారు. దీని దిగువన నదీ ప్రవాహం పెరిగి మట్టి అండలు అండలుగా జారిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. పట్టిసీమ ఔట్‌ఫాల్ స్లూయిజ్ నుంచి కొవ్వాడ అధిక జలాలు గోదావరి నదిలోకి చేరుతాయి. కొండవాగుల నీరు నేరుగా ఉద్ధృతంగా దిగువన గట్టును తాకుతూ నదిలోకి చేరుతుంది. వర్షాకాలంలో వరదలు, కొండవాగుల నీరు ఒకేసారి చేరుతుండటంతో గట్టు కోత క్రమంగా పెరిగి, పంచాయతీ భవన సమీపానికి చేరుకుంది. ఈ భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ భవనం పక్కనే మరో రెండు భవనాలు కూడా ఉన్నాయి. ఔట్‌ఫాల్ స్లూయిజ్ ఎదురుగా లంక ఒడ్డు పెద్దెత్తున పెరిగిపోవడంతో కొండవాగుల నీటి ప్రవాహం ఒక వైపునకు చేరుకుంది. గత నాలుగు సంవత్సరాలుగా ప్రతీ ఏడాది వచ్చే గోదావరి వరదలతో పాటు కొండవాగుల నీరు కూడా నదిలోకి చేరుతుండటంతో నీరంతా ఒక వైపుకు ప్రవాహం మారిపోయింది. దీంతో ఈ ఒడ్డున ఉన్న భవనాలు ఎప్పుడు కూలిపోతాయో అనే పరిస్థితి నెలకొంది. ప్రతీ సంవత్సరం జరిగే మహా శివరాత్రి ఉత్సవాల సమయంలో భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లపై అధికారులు ఈ ప్రదేశంలోనే సమీక్షలు నిర్వహిస్తుంటారు. అంతేకాక అధికార యంత్రాంగం ఇక్కడ మకాం వేసి ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. నదివైపు కోత నివారణకు రక్షణ గోడ నిర్మించకపోతే మరింత కోతకు గురై ఈ భవనాలు కూడా నేలమట్టం అయ్యే పరిస్థితి ఉందని స్థానికులు చెబుతున్నారు.